ప్రభాత సమాచారం
https: epaper.prabhathasamacharam.com
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
■ మంగళవారం । 28 ఏప్రిల్ 2026 । ■ 10 పేజీలు

## పోడు పట్టాలివ్వాలి

■ ఐటీడీఏ ఎదుట గ్రామీణ పేదల సంఘం ఆందోళన
■ 1/70 చట్టం, అటవీ చట్టాలను పక్కాగా అమలు చేయాలి
■ ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యుత్, రోడ్డు, గృహ వసతి కల్పించాలి..



10

# మండే సూర్యుడు

■ ముదురుతున్న ఎండలు ■ బయటకెళ్లేందుకు జంకుతున్న జనం
■ 44 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు ■ పగలు భగభగ రాత్రి ఉక్కపోత
■ నిర్మానుష్యంగా రహదారులు ■ వ్యాధుల బారిన చిన్నారులు, వృద్ధులు

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎండలు విపరీతంగా మండిపోతున్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం నుంచే భానుడి భగభగలకు పగటి ఉష్ణోగ్రతలు అమాంతంగా పెరిగిపోతున్నాయి. ఎండలు దంచికొట్టడంతో భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయి. సూర్య ప్రతాపం కారణంగా వారం పది రోజు లుగా ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. విప రీతమైన దాహార్తితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎండలు రోజు రోజుకు మండిపో తుండడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సూర్యుడు తన ప్రతాపం చూపిస్తుండడంతో మ ధ్యాహ్నం సమయంలో ప్రజలు ఇళ్లకే పరిమి తం కావలసి వస్తోంది. సాధారణంగా మే నెల లో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయి. అందుకు భిన్నంగా ఏప్రిల్‌లోనే ఎండలు తీవ్ర రూపం దాల్చుతున్నాయి. జిల్లాలో క్రమేపీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో వాతావరణశాఖ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇళ్ల నుంచి బయటకు రావడా నికి ఇబ్బందులు పడుతున్నారు.

వివరాలు 8లో







5

## అట్టహాసంగా బీఆర్ఎస్ ఆవిర్భావం

■ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో అంబరాన్నంటిన గులాబీ శ్రేణుల సంబురాలు
■ ఊరూరా రెపరెపలాడిన జెండాలు ■ తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు
■ కేసీఆర్ తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపారని ప్రశంసలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం అంబరాన్నంటాయి. శ్రేణులు ఊరూరా సంబురాలు నిర్వహించాయి. బీఆర్ఎస్ కార్యాలయాలు, ప్రధాన చౌరస్తాల్లో పార్టీ అధ్యక్షులు, నాయకులు గులాబీ జెండాలు ఎగరేసి.. జై తెలంగాణ.. జై కేసీఆర్.. జైజై కేటీఆర్.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కేక్‌లు కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో తెలంగాణతల్లి విగ్రహానికి బీఆర్ఎస్ శ్రేణులు పూలమాల వేశారు.

## గంగాపూర్ పంచాయతీ కార్యదర్శిపై కలెక్టర్ వేటు

## మా బంగారం ఎప్పుడిస్తరు

■ చెన్నూరులోని ఎస్‌బీఐ బ్రాంచ్-2లో గోల్డ్‌లోన్ బాధితుల నిరసన
■ అధికారులతో వాగ్వాదం
■ తొమ్మిది నెలలు గడుస్తున్నా న్యాయం చేయడంలేదని ఆవేదన

చెన్నూర్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్-2లో లోన్ కోసం తనఖా పెట్టిన బంగారం ఎప్పుడిస్తరని అధికారులను బాధితులు ప్రశ్నించారు. ఈ మేరకు బాధితులు చెన్నూర్‌లోని ఎస్‌బీఐ బ్రాంచ్ 2లో సోమవారం ఆందోళన చేపట్టారు.





10

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

■ మంత్రుల పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు ఆదేశం
■ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష
■ ఏ ఫైలు కూడా అధికారుల వద్ద వారం రోజుల కంటే ఎక్కువ పెండింగ్‌లో ఉండొద్దు
■ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి ■ అర్హులకు రుణాలు అందేలా చూడాలి..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, క్షేత్రస్థాయిలో పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ, ఉమ్మడి జిల్లా ఇంచార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. హిమాయత్‌నగర్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.



# 'ఆఫ్టర్ కేర్'తో యువతకు స్వయం సమృద్ధి





- జిల్లా సంక్షేమ అధికారి మిల్కా
- 18 ఏళ్లు నిండిన యువతకు భరోసా కల్పిస్తున్న 'ఆఫ్టర్ కేర్' పథకం
- వృత్తి విద్యా శిక్షణతో పాటు ఉపాధి, నివాస సదుపాయాల కల్పన
- చైల్డ్ కేర్ సంస్థల నుంచి బయటకు వచ్చే యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**ఆదిలాబాద్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్ల నుండి 18 ఏళ్లు నిండి బయటకు వచ్చే యువత సమాజంలో స్వయం సమృద్ధి సాధించేలా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆఫ్టర్ కేర్' కార్యక్రమం ఒక గొప్ప వరమని జిల్లా సంక్షేమ అధికారి మిల్కా పేర్కొన్నారు. 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అనాథ యువత 18 ఏళ్లు నిండిన తర్వాత ఒంటరితనం, అభద్రతా భావానికి గురికాకుండా వారికి సామాజికంగా, మానసిక ధైర్యాన్ని అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని వివరించారు. సొంత ఇల్లు లేని యువతీ యువకులకు ప్రభుత్వ ఆధ్వర్యంలో సురక్షితమైన నివాస సౌకర్యం కల్పించడంతో పాటు, వారి ఆసక్తిని బట్టి వివిధ రంగాల్లో వృత్తి విద్యా శిక్షణ ఇప్పించి నైపుణ్యాలను మెరుగుపరుస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం యువత ఉపాధి లేదా స్వయం ఉపాధి పొందేలా ప్రభుత్వం రుణ సదుపాయాలు, ఇతర ప్రోత్సాహకాలను అందిస్తుందని వెల్లడించారు. కార్యక్రమాన్ని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తుందని, జిల్లాలోని సీసీఐల నుంచి బయటకు వచ్చిన అర్హులైన యువత, సంబంధిత స్వచ్ఛంద సంస్థలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల వారు ఆదిలాబాద్‌లోని జిల్లా బాలల సంరక్షణ యూనిట్ కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నరేందర్, టీబీ నియంత్రణ అధికారి సుమలత, ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్, సైకియాట్రిస్ట్ ఓం ప్రకాష్ పాల్గొన్నారు.

# ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరించాలి



- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- పోలీసు కార్యాలయంలో 'ప్రజా ఫిర్యాదుల' నిర్వహణ ■ 36 ఫిర్యాదుల స్వీకరణ
- సమస్యల పరిష్కారానికి అధికారులకు దిశానిర్దేశం
- అసాంఘిక కార్యకలాపాల సమాచారం కోసం వాట్సాప్ నెంబర్ వెల్లడి

**ఆదిలాబాద్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల పోలీసులు గౌరవంగా వ్యవహరించాలని, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల రోజు' (గ్రీవెన్స్ డే) కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి బాధితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భూ ఆక్రమణలు, కుటుంబ కలహాలు, భార్యాభర్తల వివాదాలు, తదితర అంశాలకు సంబంధించి మొత్తం 36 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. బాధితుల సమస్యలను ఓపికగా విన్న ఎస్పీ, అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. బాధితుల సమస్యలను పరిష్కరించడం ద్వారానే పోలీసు వ్యవస్థపై ప్రజలకు గౌరవం, నమ్మకం పెరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం చేకూర్చడమే పోలీసుల ప్రధాన బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు. జిల్లాలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, గుడుంబా, మత్తు పదార్థాల విక్రయాలు వంటివి జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. ఇందుకు సంబంధించి ప్రజలు 8712659973 అనే వాట్సాప్ నెంబర్‌కు మెసేజ్ లేదా సమాచారం అందించవచ్చని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిసి కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారి జైస్వాల్ కవిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించండి

**స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జల కుమారి**

**కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు దిశానిర్దేశం**

**నిర్మల్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ల్యాండ్ ఆక్విజిషన్ నాయక్వాడి జల కుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ల్యాండ్ ఆక్విజిషన్ జల కుమారి, జెడ్పీ సీఈవో భాగ్యలక్ష్మితో కలిసి పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆమె స్వయంగా స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## 29న ద్విచక్ర వాహనాలు బహిరంగ వేలం పాట

**లక్షెట్టిపేట, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్, లక్షెట్టిపేట పరిధిలో వివిధ కేసుల్లో జప్తు చేయబడిన ద్విచక్ర వాహనాల బహిరంగ వేలంపాటను ఈ నెల 29న నిర్వహించనున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎస్. సమ్మయ్య తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సమక్షంలో ఉదయం 10 గంటలకు ఈ వేలం ప్రక్రియ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు పూర్తి వివరాల కోసం లక్షెట్టిపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాన్ని సంప్రదించాలని ఇన్స్పెక్టర్ సూచించారు.



# ప్రభుత్వ అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలి





- మంచిర్యాల నగర మేయర్ దర్ని మధుకర్
- ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా 'ఆఫ్టర్ కేర్' కార్యక్రమం
- చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్‌లలోని పిల్లలకు ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు ఖాతాల పంపిణీ...
- మే వరకు బాలల భద్రత, సంరక్షణ వారం నిర్వహణ

**మంచిర్యాల, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** పిల్లలు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆఫ్టర్ కేర్ కార్యక్రమానికి జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా బాలల భద్రత, రక్షణ వారాన్ని మే 2వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా మొదటి రోజు పైన సోమవారం రోజున చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూట్ లో ఉన్న పిల్లలకు అవసరమైన ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, కుల దృవీకరణ, బ్యాంక్ ఖాతా, జనన ధ్రువీకరణ, ఇతర పత్రాలు అందించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకొని పిల్లలు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

## ఎరువుల కంపెనీ యాజమాన్యాల ఆంక్షలు
# నిలిపివేయాలని దుకాణాల బంద్




**తాండూర్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** ఎరువుల కంపెనీల యాజమాన్యాల తీరు వల్ల రైతులు, షాపుల డీలర్లు ఇబ్బందులు పడుతున్నారని, ఆంక్షలు విధించడం మానుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం తాండూర్ మండలంలో డీలర్లు సీడ్స్, ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ దుకాణాలను మూసివేసి నిరసన తెలిపారు. మండల కేంద్రం లోని తాండూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫర్టిలైజర్ సంఘం మండల అధ్యక్షుడు బోనగిరి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బాలు ప్రసాద్ మారు, కోశాధికారి దత్తుమూర్తి, తాండూర్ మండల ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు మాట్లాడారు. దేశ వ్యాప్తంగా నిర్వహించిన బంద్‌లో భాగంగా డీలర్లు రైతుల సమస్యల పరిష్కారం కోసం తాండూర్ మండల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు దుకాణా లు స్వచ్ఛందంగా మూసివేసినట్లు తెలిపారు. ఎరువుల ధరలు రోజు రోజుకూ భారమవు తున్నాయని, మరో వైపు కంపెనీలు వివిధ ఉత్పత్తులను లింక్ రూపంలో ఇవ్వడం ద్వారా రైతులకు అదనపు భారం పడుతుందని వివరించారు. రవాణా చార్జీలు ఎక్కువగా ఉన్నందున ఆ భారం డీలర్లపైన పడి నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఫర్టిలైజర్‌లో ఎఫ్ఓఎల్ క్రింద యూరియా, డీఏపీ కాంప్లెక్స్, ఫొటాస్ లింకు ప్రోడక్టులు ఇవ్వకుండా ఎరువులు సరాపరా చేయాలని డిమాండ్ చేశారు. విత్తనాలు, ఎరువుల శాంపిల్స్ ఫెయిల్ అయితే కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో తాండూరు మండల ఫర్టిలైజర్ షాపుల యజమానులు పాల్గొన్నారు.



### పోటీపడి చదవండి
## ఉన్నతులుగా ఎదగండి

**బోథ్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** నిరుద్యోగ యువత కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉందని ఎంపీడీవో రమేష్ పేర్కొన్నారు. యువకులు ఒకసారి ఉద్యోగం రాకపోతే నిరాశ చెందవద్దని మరింత కసితో చదవాలని అప్పుడే ఏదైనా అనుకున్న సాధిస్తామన్నారు. సోమవారం మండలంలోని కౌటబి గ్రామంలో నిరుద్యోగ యువతకు సైబర్ సెక్యూరిటీ వింగ్ ఏఎస్ఐ సురేందర్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. యువత లక్ష్యం ఎంచుకొని లక్ష సాధన దిశగా నిరంతరం శ్రమించాలని ఆయన కోరారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వస్తే మూడు తరాలు మారిపోతాయి అన్నారు. తాను పుట్టి పెరిగిన గ్రామానికి చేయాలను దృక్పథంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అంతేగాక సైబర్ నేరాలపై అవగాహన కలిగించారు.

### ఎస్టీ బాలుర వాసవి గృహాన్ని
## తనిఖీ చేసిన ఏటిడిఓ



**బోథ్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** బోథ్ మండల కేంద్రంలోని బాలుర వసతి గృహాన్ని ఏటిడిఓ సోమవారం మధ్యాహ్నం తనిఖీ చేశారు .ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న భోజన వసతి గురించి అడిగి తెలుసుకున్నారు. అంతేగాక స్టాఫ్ విరాలను పరిశీలించడం జరిగింది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని విద్యార్థులు క్రమశిక్షణతో ఉండి చదువుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఆరోగ్యం పట్ల తగు శ్రద్ధ చూపించాలని వ్యాధులు సోకిన వెంటనే సరైన వైద్యం అందించాలని తెలిపారు. ఆయన వెంట హాస్టల్ వార్డెన్ ప్రశాంత్ తో పాటు ఏఎన్ఎం ఉన్నారు.

### ఉత్సాహంగా బిఆర్ఎస్
## ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆసిఫాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి తనయుడు, యువ నాయకుడు కోవ సాయినాథ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గత రెండున్నర దశాబ్దాల్లో పార్టీ సాధించిన విజయాలు, తెలంగాణ రాష్ట్ర సాధన, రాష్ట్ర అభివృద్ధిలో బిఆర్ఎస్ పాత్రను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, గుండి సర్పంచ్ జబరి రవీందర్, మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, వైస్ చైర్మన్ ఎం.డి. అహ్మద్, నాయకురాలు మర్సకోల సరస్వతి, మాజీ సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, కౌన్సిలర్లు చిలువేరు వెంకన్న, కుర్సెంగ బాలకృష్ణ, సర్పంచ్ పోచయ్య, ఉప సర్పంచ్ మామిడి లక్ష్మి, గిరి,రవి తదితరులు హాజరయ్యారు.



## యూరియా వాడకాన్ని తగ్గిస్తే నేల తల్లికి ఎంతో మేలు

**తాండూర్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** రైతులు యూరియా వాడకాన్ని తగ్గిస్తే నేల తల్లికి ఎంతో మేలని బెల్లంపల్లి ఏడీఏ రాజ నరేందర్, డాక్టర్ యం రాజ శేఖర్, డాక్టర్ షైన్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని నర్సాపూర్ గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియా వాడకం తగించడం వల్ల నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. సాగు నీటిని ఆదా చేయడం, పంట మార్పిడి చేయడం వలన చీడపీడలను తగించవచ్చని సూచించారు. ఈ ప్రాంతంలో పత్తి, జొన్న, మొక్కజొన్న సాగుకు అనుకూలమని,పప్పు దినుసుల పంటలైన పెసర, మినుములు, కూరగాయల పంటలు సాగు చేయాలన్నారు. చెట్లను పెంచడం వలన పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. రసాయనాలను అవసరాన్ని



బట్టి వాడటంతో పాటు రశీదులను భద్రపరుచుకోవాలని సూచించారు. వరిలో సన్న గింజ రకాలు, వాటి లక్షణాలు, పాటించాల్సిన పద్ధతులను వివరించారు. సంప్రదాయ పంటలతో పాటు ఇతర వాణిజ్య పంటలు (ఆయిల్ పామ్) సాగు చేసి రైతులు ఆర్థికంగా వృద్ధి చెందాలన్నారు. సర్పంచ్ ప్రభాత్ రావు, ఉప సర్పంచ్ పర్బత్ రావు, ఏఈవో వెంకటేష్, పంచాయతీ సెక్రటరీ జగదీష్, గ్రామ ప్రతినిధులు, రైతులు, యువకులు, పాల్గొన్నారు.

## మరణం తర్వాత కూడా వెలుగులు పంచిన శతాధిక వృద్ధురాలు



**బెల్లంపల్లి, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** "జీవించి ఉన్నప్పుడు మాత్రమే కాదు, మరణించిన తర్వాత కూడా ఇతరులకు ఉపయోగపడాలి" అనే గొప్ప ఆలోచనకు హనుమాన్ బస్తీకి చెందిన ఓ కుటుంబం నిదర్శనంగా నిలిచింది. 103 ఏళ్ల శతాధిక వృద్ధురాలు డోలి నరసమ్మ తుదిశ్వాస విడిచిన వేళ, ఆ కుటుంబం పుట్టెడు దుఃఖంలోనూ సామాజిక బాధ్యతను మరువకుండా, ఆమె నేత్రాలను దానం చేసి ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపే ప్రయత్నం చేసింది. బెల్లంపల్లి పట్టణం హనుమాన్ బస్తీకి చెందిన డోలి నరసమ్మ వృద్ధాప్య సంబంధిత అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం కన్నుమూశారు. తల్లిని కోల్పోయిన బాధలో ఉన్నప్పటికీ, ఆమె కుటుంబ సభ్యులు సేవా దృక్పథాన్ని వీడలేదు. విషయం తెలుసుకున్న 'జనహిత సేవా సమితి' సభ్యుడు డోలి సుకుమార్, నరసమ్మ కుటుంబ సభ్యులకు నేత్రదానం యొక్క విశిష్టతను వివరించి అవగాహన కల్పించారు. దీనికి కుటుంబ సభ్యులు వెంటనే సానుకూలంగా స్పందించి, నేత్రదానానికి ముందుకు వచ్చారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో వరంగల్‌లోని వి.వి. ప్రసాద్ ఐ బ్యాంక్ సిబ్బంది ప్రదీప్ ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధి సతీష్ మాట్లాడుతూ, తమ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన 14వ నేత్రదానం ఇదని, శతాధిక వృద్ధురాలి కుటుంబం చూపిన ఈ చొరవ ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. నరసమ్మ మరణానంతరం ఆమె నేత్రాల ద్వారా ఇద్దరు అంధులకు చూపు దక్కనుండటం గొప్ప విషయమని ఆయన అన్నారు. మృతురాలి కుమారులు డోలి దశరథ్, విజయ్ కుమార్, శేఖర్, కోడళ్లు, కుమార్తెలు, అల్లుళ్లు మనుమలు, మనుమరాళ్లు అంత్యక్రియల సమయంలో పాల్గొని నరసమ్మకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వి.వి. ప్రసాద్ ఐ బ్యాంక్ ప్రతినిధులు నేత్రదాన ధ్రువీకరణ పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. దుఃఖంలోనూ నరసమ్మ కుటుంబం తీసుకున్న ఈ నిర్ణయం స్థానికంగా ఉన్న ప్రజలను, బంధుమిత్రులను విశేషంగా ఆకట్టుకుంది.

## బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**బెజ్జూర్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** బెజ్జూర్ మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,పార్టీ శ్రేణులు బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేసి ఘనంగా వేడుకను జరుపుకున్నారు. పార్టీ వ్యవస్థాపకుడు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, కోనేరు అభిమాన నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





### ఘనంగా బిఆర్ఎస్ ఆవిర్భావ
## దినోత్సవ వేడుకలు

**రెబ్బెన, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** రెబ్బెన మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గులాబీ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ రాష్ట్ర సాధనలో బీఆర్ఎస్ పాత్రను నాయకులు స్మరించుకున్నారు. తెలంగాణ ఆత్మ గౌరవానికి ప్రతీకగా గులాబీ జెండా నిలిచిందని, రాష్ట్ర అభివృద్ధిలో బీఆర్ఎస్ ప్రత్యేక గుర్తింపు సాధించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ప్రభాకర్, పాపయ్య, దుర్గం శంకర్, పోతిరెడ్డి, దుర్గం వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 30న రుణాల కోసం ఇంటర్వ్యూ

**బెల్లంపల్లి, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** ఎస్సీ కార్పొరేషన్ 2025-26 ఆర్థిక సంవత్సరం రుణాల కోసం ఈ నెల 30న మునిసిపల్ కార్యాలయంలో 11గంటలకు ఇంటర్వ్యూ లు ఏర్పాటు చేసిన నట్టు బెల్లంపల్లి మునిసిపల్ కమిషనర్ సంపత్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఎస్సీ నిరుదోగ్య యువతీ యువకులు ఈ ఇంటర్వ్యూ కు హాజరు కావాలని కోరారు. ఎస్సీ నిరుదోగ్య యువతీ యువకులను ఆయా బ్యాంకు మేనేజర్లు ఇంటర్వ్యూ చేసి అర్హత గల ఎస్సీ నిరుదోగ్య యువతీ యువకులకు ఎంపిక చేస్తారని తెలిపారు. ఆన్లైన్ నందు దరఖాస్తు చేసుకున్న ఎస్సీ నిరుదోగ్య యువతీ యువకులందరూ సంబందిత సర్టిఫికేట్ ఒరిజినల్, జిరాక్స్ కాపిలతో పాటు ఒక పాస్ ఫోటో తీసుకొని సకాలములో హాజరు కావాలనీ తెలిపారు. ఈ అవకాశాన్ని దరఖాస్తు చేసుకున్న యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# జాతీయ రహదారిపై సోలార్ వెలుగులతో భద్రతకు భరోసా

- జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు
- వాహనాల వేగం గుర్తించేందుకు కెమెరాల ఏర్పాటు
- హైదరాబాద్ టూ నాగ్‌పూర్ వరకు ఏర్పాటు చేయాలని ప్రజల డిమాండ్



**ఉట్నూర్, ఏప్రిల్ 27 (ప్రభాత సమాచారం)**
జాతీయ రహదారిపై తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవతో ప్రమాదాలు జరి గే స్థలంలో సోలార్ విద్యుత్ వెలుగులను ఏర్పాటు చేశారు. నిత్యం రాత్రి వేళల్లో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న విషయాన్ని కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ గుర్తించారు. దీంతో ప్రమాదాలను అరికట్టాలని అధికారులు నిర్ణయించారు. అనుకున్నదే తడవుగా అధికారులు ముందు చూపుతో ఎక్కువగా ప్రమాదాలు జరిగే గుడిహత్నూర్ నుండి సీతాగొంది, మేకలగండి ప్రాంతంలో రాత్రి వేళలో విద్యుత్ వెలుగులు విరజల్లె విధంగా సోలార్ విద్యుత్ వెలుగులను ఏర్పాటు చేశారు. సోలార్ విద్యుత్ వెలుగులో రాత్రి సమయంలో సైతం రెండు కిలోమీటర్ల దూరం నుండి ప్రయాణించే వాహనాల వేగాన్ని, ప్రమాదాలను పసిగట్టే విధంగా సీతాగొంది గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశా రు. జిల్లా ఉన్నత అధికారులు నిర్ణయం తీసుకొని సోలార్ విద్యుత్ వెలుగులు, సీసీ కెమెరా లు ఏర్పాటు చేయడంతో జాతీయ రహదారిపై ప్రయాణం చేసే వాహన చోదకులతో పాటు నిత్యం ప్రయాణం చేసే ప్రయాణం ప్రయాణికులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఐతే జిల్లాలోని జాతీయ రహదారి పై జరిగే తరుచు ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించి, అక్కడ సైతం సోలార్ విద్యుత్ వెలుగులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



## ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**మంచిర్యాల, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):**
బీఆర్ఎస్ హైదరాబాద్ దినోత్సవ వేడుకలు నస్పూర్ మండలంలో బీఆర్ఎస్ నాయకులు సోమ వారం ఘనంగా నిర్వహించారు. నస్పూర్ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు బిఆర్ఎస్ పార్టీ జెండా పతాక ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, టీబీజీకేఎస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయాల వ్యాపారుల ఆందోళన



**బెల్లంపల్లి, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):**
బెల్లంపల్లి కూరగాయల హోల్సేల్ విక్రయాలను మార్కెట్ కాంప్లెక్స్ లోకి మార్చాలని కూరగాయల వ్యాపారస్తులు ఆందోళన చేశారు. పట్టణ మార్కెట్ సముదాయం ఎదుట కూరగాయల వ్యాపారస్తులు ధర్నా చేశారు. హోల్ సేల్ వ్యాపారుల విక్రయాల వల్ల తాము నష్టపోతున్నామని వాపోయారు. పద్మశాలి భవన ఎదురుగా నిర్వహిస్తున్న హోల్సేల్ విక్రయాలను వెంటనే నిలిపివేసి, కూరగాయల మార్కెట్లో అమ్మకాలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ సంపత్ ఆందోళన కారులకు వద్దకు వచ్చి వ్యాపారస్తులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో కూరగాయల వ్యాపారస్తులు తమ ఆందోళన విరమించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి కూరగాయల మార్కెట్ వ్యాపారస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## సర్వేలో అన్ని అంశాలను పకడ్బందీగా సేకరించాలి

**నిర్మల్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):**
గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సర్వేను ప్రామాణికంగా చేపట్టాలని నిర్మల్ రూరల్ తాసిల్దార్ ప్రభాకర్ అన్నారు. సోమవారం ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న సర్వ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ప్రతి ఇంట్లో కుటుంబ వివరాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న రెవిన్యూ అధికారులు ఉన్నారు.



# ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాలని రాస్తారోకో



**దండేపల్లి, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):**
యాసంగిలో రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంటల కోసం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో వెంటనే తూకాలను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం ముత్యంపేటలో అన్నదాతలు సోమవారం రాస్తారోకో నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు ముత్యంపేటలో వంతెన వద్దకు చేరుకుని బైఠాయించారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తాము పగలు రాత్రి తేడా లేకుండా ధాన్యం కుప్పల వద్ద పడిగాపులు కాస్తూ రోజుల తరబడి ఇబ్బందులు పడుతున్నామన్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా ధాన్యం తూకం వేయడం లేదని వాపోయారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం, అ?ధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న ఎస్సై తహసీనోద్దీన్ సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. రైతులు వినకపోవడంతో ఎస్సై తహసీల్దార్‌తో ఫోన్‌లో రైతులతో మాట్లాడించారు. రేపటి వరకు ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తామని తహసీల్దార్ రైతులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.




## పోరుబాట పోస్టర్ల విడుదల

**నిర్మల్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):**
టిఆర్ఎస్వి ఆధ్వర్యంలో పెండింగ్ ఉపకార వేతనాల విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29న నిర్వహించి పోరుబాట పోస్టర్లను సోమవారం నాయకులు విడుదల చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు మార్గొండ రాము, టిఆర్ఎస్వి జిల్లా అధ్యక్షులు మహేష్ ఆధ్వర్యంలో పోస్టల్ విడుదల చేసి విద్యార్థులు తరలి రావాలని పిలుపునిచ్చారు,

## నిర్మల్ జిల్లా అధికార ప్రతినిధిగా వసంతరావు

**నిర్మల్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):**
నిర్మల్ జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ అధికారిక ప్రతినిధిగా "పాముల వసంతరావు ను నియమించినట్టు పార్టీ జిల్లా కన్వీనర్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సయ్యద్ హైదర్ తెలిపారు పార్టీ కార్యాలయంలో సోమవారం నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా సయ్యద్ హైదర్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి మరియు ప్రజా సమస్యలపై గళం ఎత్తడానికి వసంతరావు సేవలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. నిర్మల్ నియోజకవర్గంలో పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు వసంతరావు పార్టీ నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ నియామకం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశాయి.




# వ్యాక్సినేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి అనిత**



**కోటపల్లి, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):**
వైద్య సిబ్బంది వ్యాక్సినేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి అనిత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్యాచ్ అఫ్ వ్యాక్సినేషన్ శిబిరాన్ని ఆమె ప్రారంభించి మా ట్లాడారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాల పరిధిలో టీకాలు త ప్పిన పిల్లలకు టీకాలు ఇవ్వాలన్నారు. ఇందు కోసం వైద్యాధికారులు, సిబ్బంది అన్ని రకాల వ్యాక్సినేషన్‌లను తీసుకుని వెళ్లాలని, అలాగే ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి సర్వే నిర్వ హించి వివరాలను నమోదు చేయాలని ఆదే శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాను సారం ఏప్రిల్, జులై, అక్టోబరు నెలల్లో తప్పిపో యిన పిల్లలందరికి వ్యాక్సినేషన్ ఇచ్చే కార్యక్ర మం జరుగుతుందన్నారు. కోటపల్లి ఆరోగ్య కేం ద్రంలో నలుగురు పిల్లలకు వ్యాక్సినేషన్‌తో పాటు ఏడుగురు పిల్లలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఇప్పించారు. వైద్య సిబ్బంది, వైద్యాధికారులు కార్యక్రమంపై దృష్టి పెట్టి అన్ని గ్రామాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమాలను నిర్వహించి అందరికి టీకాలు అందేలా చర్యలు చేపట్టాలని సిబ్బంది సమయ పాలన పాటిస్తూ వైద్య సేవలందించాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేష్, డీపీహెచ్ఎన్ ఆర్ఎస్ పద్మ పాల్గొన్నారు.




## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఘనంగా

# బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలు ఎండగడుతాం
- బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవంలో జోగు రామన్న

**ఆదిలాబాద్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** తెలంగాణ రాష్ట్రంపై కుట్రలు పన్నుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి, వారి వైఫల్యాలను ఎండగడతామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న అన్నారు. బీ.ఆర్.ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంపై జెం డాను ఎగరవేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా స్థాపించబడిన బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ఆత్మగౌరవం కోసం నిరంతరం పోరాడుతూనే ఉంటుందని తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసేలా జరుగుతున్న కుట్రలను తిప్పికొట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అలాల్ అజయ్, విజ్జగిరి నారాయణ, దాసరి రమేష్, మెట్టు ప్రహ్లాద్, గంద్రత్ రమేష్, యూనుస్ అక్బని, సెవ్వ జగదీష్, కస్తల ప్రేమల, స్వరూప రాణి, బొడగం మమత తదితరులు పాల్గొన్నారు.

**కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో..**

ప్రజాసంక్షేమం బిఆర్ఎస్‌తోనే సాధ్యమని బిఆర్ఎస్ మండలాధ్యక్షుడు జాబరి రవీందర్ అన్నారు. బి ఆర్ ఎస్ 26 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆదేశాల మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్‌భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ మండలాధ్యాక్షుడు రవీందర్, యువ నాయకుడు కోవ సార్లయినాథ్, మున్సిపల్ చైర్మన్ ఆకాష్,వైస్ చైర్మన్ అహ్మద్ ,నాయకులతో కలిసి జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రాష్ట్ర నాయకురాలు మర్సకోల సరస్వతి, మాజీ సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్,కౌన్సిలర్లు చిలువేరు వెంకన్న, కుర్సెంగ బాలకృష్ణ, రాజం పేట సర్పంచ్ బుర్స పోచయ్య, ఉప సర్పంచ్ మామిడి లక్ష్మి, నాయకులు నిస్సార్, ఆన్సర్, జీవన్, సాయి శ్రవణ్, నారాయణ, బలరాం నాయక్, అశోక్, ప్రేమ్ కుమార్, ఆశన్న,గిరి, రవి తదితరులు పాల్గొన్నారు.

**నిర్మల్ పట్టణంలో..**

భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవం పట్టణంలోని కొండాపూర్ పార్టీ కార్యాలయంలో సోమవారం జరుపుకున్నారు. పట్టణ అధ్యక్షులు మార్గొండ రాము ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలు తెలం గాణ కోసం అమరులైన వీరులకు నివాళి అర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కెసిఆర్ నాయకత్వంలో ఏర్పడ్డ టిఆర్ఎస్ పార్టీ ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మహేష్ రెడ్డి మహేష్, పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

**చెన్నూర్ నియోజకవర్గంలో..**

చెన్నూర్ నియోజక వర్గంలోని కోటపల్లి మండలం సర్వాయిపేటలో సోమ వారం బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. కోటపల్లి మండల సోషల్ మీడియా కన్వీనర్ బాపు నాయక్ పార్టీ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ పార్టీ గ్రామ సీనియర్ నాయకులు ధనం జై, గ్రామ అధ్యక్షులు ఊరటి రాజ్ కుమార్, దుర్గం రాజేందర్, చేడంక రమేష్, దుర్గం కిష్ట స్వామి, గుగ్లోత్ పునం, జిమిడి రాజ బాపు, కోట నాగరాజ్, కార్యకర్తలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

**తాండూరు మండలంలో...**

మంచిర్యాల జిల్లా తాండూరు మండలంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. తాండూర్ ఐబీలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సుబ్బ దత్తుమూర్తి, మండలంలోని పలు గ్రామాలలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమ నాయకుడు, తెలంగాణ సాధన రథసారథి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో పాటు, గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో సబ్బండవర్గాల అభివృద్ధి కోసం కేసీఆర్ కృషి చేశారని అన్నారు. తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ సర్కార్ అధికారంలోకి రానుందని తెలిపారు. అనంతరం మిఠాయిలు, పండ్లు పంచి సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.






# అగ్రో డీలర్ల నిరసన

**ఆదిలాబాద్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** ఎరువుల కంపెనీలు డీలర్లపై అనవసరమైన ఒత్తిడి తెస్తూ, యూరియా, ఎరువులను విక్రయించాలంటే అవసరం లేని ఇతర ఉత్పత్తులను కూడా కొనుగోలు చేయాలని బలవంతం చేస్తున్నాయని అగ్రో డీలర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటిపెల్లి శివప్రసాద్ ఆరోపించారు. రాష్ట్ర అగ్రో డీలర్ల పిలుపు మేరకు సోమవారం ఆదిలాబాద్‌లో డీలర్లు ఒక రోజు దుకాణాలను మూసి కిసాన్ చౌక్‌లో కిసాన్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన తెలిపారు. వారి నిరసనకు ఆదిలాబాద్ డివిజన్ ఆత్మ చైర్మన్ గిమ్మ సంతోష్ మద్దతు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు ముందు కంపెనీలు డీలర్లపై అదనపు భారం మోపుతున్నాయని, ఒక బస్తాపై రూ.40 నుంచి రూ.50 వరకు అదనపు ఖర్చు పడుతోందని తెలిపారు. సాథీ పోర్టల్ వల్ల రైతులతో పాటు డీలర్లకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, సమస్యలు పరిష్కరించకపోతే పూర్తి స్థాయిలో దుకాణాలు మూసివేసి నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీలర్లు కత్తూరి ప్రశాంత్, సందేష్, శ్రీనివాస్, బాలాజీ శ్రీను, సంతోష్, క్యాతం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దు

**మామడ, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొని లబ్ధి పొందాలని, నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని న్యూ సాంగ్వి, ఆదర్శనగర్ గ్రామాల్లో పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్ముకొని 2389 రూపాయలు మద్దతు ధర పొందాలని ఆయన పేర్కొన్నారు. ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు అశ్విన్ రెడ్డి, ముత్యం రెడ్డి, లక్ష్మి



ఏఎంసి డైరెక్టర్ వకీల్, పిఏసిఎస్ సీఈఓ రాజేందర్, నాయకులు గంగారెడ్డి, వికాస్ రెడ్డి, ప్రశాంత్, లింగారెడ్డి, నితిన్ రెడ్డి, ప్రశాంత్, భోజన్న, రవి, రైతులు పాల్గొన్నారు.

# పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు



**తాండూర్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** పంచాయతీల అధికారులు, సిబ్బంది పారిశుధ్య పనుల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని మంచిర్యాల జిల్లా పంచాయతీ అధికారి డి వెంకటేశ్వర్ రావు హెచ్చరించారు. మండలంలోని రేచిని, చౌటపల్లి గ్రామపంచాయతీ లను బెల్లంపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి కె సతీష్ కుమార్‌తో కలిసి సోమవారం సందర్శించారు. చౌటపల్లి గ్రామపంచాయతీ సీఎం ఏజేఏవై పథకానికి ఎంపికైన సందర్భంగా ఎంపిక చేసిన పనుల వివరాలను తెలుసుకున్నారు. ఈ ప్రాజెక్టు ప్రయోజనాలు అందరికీ అందే విధంగా చూడాలని స్థానిక ప్రజాప్రతినిధులకు, పంచాయతీ కార్యదర్శులకు దిశా నిర్దేశం దేశారు. అనంతరం పారిశుధ్య కార్యక్రమాలు పరిశీలించారు. మురికి నీటి కాలువ చివరలో ఇంకుడు గుంతలు నిర్మించాలని సూచించారు. రేచిని గ్రామపంచాయతీ పరిధిలో డ్రైన్స్, వాటర్ పంపులు, ఇందిరమ్మ ఇళ్లను తనిఖీ చేసి కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. నర్సరీ, వైకుంఠ ధామం, సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించి తగు సూచనలు చేశారు. వారి వెంట ఎంపీడీవో పీ శ్రీనివాస్, ఎంపీవో అనిల్ కుమార్, సర్పంచులు ముదాం సునీత, పోతురాజుల రాంబాయి, కార్యదర్శులు శ్రీనివాస్, వసంత, సిబ్బంది ఉన్నారు.



## వాగులో స్నానానికి వెళ్లి

# యువకుడు జలసమాధి

### సారంగాపూర్‌లో విషాదం

**సారంగాపూర్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** నిండు నూరేళ్ల జీవితం ఆ యువకుడి ముందు ఉందని ఆశపడిన ఆ కుటుంబంలో ఆకస్మిక మరణం విషాదాన్ని నింపింది. స్నేహితులతో కలిసి సరదాగా స్నానానికి వెళ్లిన యువకుడు, విధి వంచనతో ప్రాణాలు కోల్పోయాడు. సారంగాపూర్ మండలం వైకుంఠాపూర్ గ్రామంలో సోమవారం జరిగిన ఈ విషాద ఘటన స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. వైకుంఠాపూర్ గ్రామానికి చెందిన సాయిప్రసాద్ (23) తన స్నేహితులతో కలిసి మధ్యాహ్న సమయంలో ఊరి సమీపంలోని వాగు వద్దకు స్నానానికి వెళ్లాడు. సరదాగా గడపాలని వెళ్లిన ఆ యువకులకు ఆ వాగు మృత్యుపాశంగా మారుతుందని ఊహించలేదు. నీటి లోతును గమనించకుండా, ఈత కొట్టేందుకు ప్రయత్నిస్తుండగా సాయిప్రసాద్ నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు అతడిని కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ, ఫలితం లేకపోయింది. నీటి ప్రవాహంలో గల్లంతైన యువకుడు మరణించాడు. కొడుకును కోల్పోయిన సాయిప్రసాద్ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. కళ్ల ముందే కొడుకు మరణించాడన్న వార్త ఆ కుటుంబంలో తీరని శోకాన్ని మిగిల్చింది. తోటి స్నేహితులు, గ్రామస్తులు సైతం ఈ ఘటన పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై శ్రీకాంత్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనంతరం కేసు దర్యాప్తు ప్రారంభించారు. వేసవి కాలం కావడంతో యువత, చిన్నారులు చెరువులు, వాగులు, కుంటల్లో ఈత కొట్టేందుకు ఆసక్తి చూపుతుంటారు. నీటి లోతును, ఇతర ప్రమాదాలను గమనిం చకుండా నీటిలోకి దిగడం ప్రాణాలకే ప్రమాదమని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# సర్వేలో అన్ని అంశాలను సేకరించాలి

**నిర్మల్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సర్వేను ప్రామాణికంగా చేపట్టాలని నిర్మల్ రూరల్ తహసీల్దార్ ప్రభాకర్ అన్నారు. సోమవారం ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న సర్వ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ప్రతి ఇంట్లో కుటుంబ వివరాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న రెవిన్యూ అధికారులు ఉన్నారు.



## 48 గంటల్లోనే మహిళా హత్య కేసు మిస్టరీ వీడింది






- పంజాబ్ కూడలి వద్ద దారుణం
- నిందితుడిని అరెస్ట్ చేసిన వన్ టౌన్ పోలీసులు
- సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలతోనే కేసు ఛేదన
- నిందితుడికి రిమాండ్
- సమర్థవంతంగా దర్యాప్తు చేసిన పోలీసు బృందానికి ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రశంసలు..

**ఆదిలాబాద్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** ఆదిలాబాద్ పట్టణంలో ఇటీవల సంచలనం సృష్టించిన మహిళ హత్యోదంతం కేసును పోలీసులు అనతి కాలంలోనే ఛేదించారు. పట్టణంలోని పంజాబ్ కూడలి సమీపంలో మురికి కాలువలో శవమై తేలిన అనిత అనే మహిళ హత్య కేసులో, నిందితుడిని పోలీసులు 48 గంటల వ్యవధిలోనే పట్టుకున్నారు. కేసును అత్యంత వేగంగా, పారదర్శకంగా దర్యాప్తు చేసిన పోలీసు బృందంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. గత ఏప్రిల్ 24 అర్ధరాత్రి పంజాబ్ చౌక్ సమీపంలోని డ్రైనేజ్‌లో ఒక మహిళ మృతదేహం పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఘటనా స్థలంలో లభించిన క్లూస్, చుట్టుపక్కల ఉన్న సీసీటీవీ ఫుటేజీలను నిశితంగా పరిశీలించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ నిందితుడి కదలికలను ట్రాక్ చేశారు. నిందితుడిని మహారాష్ట్రకు చెందిన నర్సింగా సంతోబా గంపల్వాడ్ (25)గా పోలీసులు గుర్తించారు. దర్యాప్తులో భాగంగా నిందితుడు పోలీసుల ముందు తన నేరాన్ని అంగీకరించాడు. ఘటన జరిగిన రోజున మద్యం మత్తులో ఉన్న నిందితుడు, రోడ్డుపై నిద్రిస్తున్న బాధితురాలిని మురికి కాలువ వద్దకు తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. బాధితురాలు తీవ్రంగా ప్రతిఘటించడంతో ఆగ్రహానికి గురైన నిందితుడు, ఆమె గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని డ్రైనేజ్‌లో పడేసి ఆధారాలు చెరిపేసేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు వెల్లడించారు. సాంకేతిక ఆధారాలను విశ్లేషించిన పోలీసులు, నిందితుడు ఆదిలాబాద్ రైల్వే స్టేషన్ పరిసరాల్లో ఉన్నట్లు గుర్తించి, వెంటనే అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్‌కు తరలించారు. క్లిష్టమైన ఈ కేసును కేవలం రెండు రోజుల్లోనే ఛేదించడంలో చూపిన చొరవపై జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సంతృప్తి వ్యక్తం చేశారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన దర్యాప్తు బృందానికి నగదు రివార్డులను, ప్రశంసా పత్రాలను అందజేశారు. నేరస్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని, బాధితులకు తక్షణమే న్యాయం చేకూర్చడమే పోలీసుల బాధ్యత అని ఎస్పీ ఈ సందర్భంగా ఉద్ఘాటించారు.

## శాంతిఖనిలో కార్మికుడి ఆత్మహత్యాయత్నం

**బెల్లంపల్లి, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** శాంతిఖని బొగ్గు గనిలో అధికారుల వేధింపులు, కక్షసాధింపు చర్యలు పరాకాష్టకు చేరుకున్నాయి. యాజమాన్యం కక్ష గట్టినట్లుగా ఒక కార్మికుడిని వేధిస్తూ, మానసిక క్షోభకు గురిచేయడంతో విసిగిపోయిన సదరు కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ సంఘటన బొగ్గు గనిలో పనిచేసే ఇతర కార్మికుల్లో తీవ్ర ఆగ్రహాన్ని, ఆందోళనను నింపింది. శాంతిఖని బొగ్గు గనిలో మాధవ్ అనే కార్మికుడు మల్టీ జాబ్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గత కొంతకాలంగా ఆయన జనరల్ షిఫ్ట్‌లో పని చేస్తున్నారు. అయితే, గనిలో జరిగిన ఒక స్వల్ప ప్రమాద ఘటనను సాకుగా చూపుతూ, అధికారులు ఆయనపై కక్ష సాధింపు చర్యలు ప్రారంభించారని తోటి కార్మికులు ఆరోపిస్తున్నారు. ఆ ప్రమాదం తర్వాత ఆయనను సస్పెండ్ చేయడం, ఆపై వారం రోజుల క్రితం బలవంతంగా జనరల్ షిఫ్ట్ నుంచి ఇతర షిఫ్టులకు మార్చడం వంటి పరిణామాలు మాధవ్‌ను మానసిక వేదనకు గురిచేశాయి. తనకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ, తిరిగి జనరల్ షిఫ్ట్‌లోనే పని కల్పించాలని మాధవ్ అధికారులను ప్రాధేయపడినా, వారు ఏమాత్రం కనికరించకుండా మొండిగా వ్యవహరించారు. అధికారుల తీరుపై తీవ్ర మనస్థాపం చెందిన మాధవ్.. చివరికి తన నిరసనను చాటేందుకు ఆత్మహత్యే మార్గమని భావించి, విధుల నిర్వహణలో భాగంగా పెట్రోల్‌తో నిండిన వాటర్ బాటిల్‌ను వెంట తెచ్చుకున్నారు. మొదటి షిఫ్ట్ సమయంలో అధికారుల సమక్షంలోనే తన వేదనను వ్యక్తం చేస్తూ, వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పు అంటించుకోవడానికి ప్రయత్నించారు. అక్కడే ఉన్న తోటి కార్మికులు వెంటనే అప్రమత్తమై, మాధవ్‌ను పట్టుకుని ఆయన ఆత్మహత్య యత్నాన్ని అడ్డుకున్నారు. ఈ ఘటనతో అక్కడున్న వారంతా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. కార్మికుల జోక్యంతో ప్రాణాపాయం తప్పినప్పటికీ, అధికారుల మొండి వైఖరిలో మాత్రం మార్పు రాలేదని తెలుస్తోంది. షిఫ్ట్ మార్పు విషయంలో వారు ఇప్పటికీ మొండిగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. శాంతిఖని గనిలో ముగ్గురు అధికారులు వ్యవహరిస్తున్న తీరు కార్మికులను బలి పశువులను చేస్తోందని ఆరోపణలు వస్తున్నాయి. అయితే, ఇంతటి తీవ్రమైన ఘటన జరిగినప్పటికీ, కార్మిక సంఘాలు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల కార్మికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల హక్కుల కోసం పోరాడాల్సిన సంఘాలు, ఇలాంటి కక్షసాధింపుల సమయంలో మౌనం వహించడం వెనుక ఉన్న మర్మమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, వేధింపులకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, మాధవ్‌కు న్యాయం చేయాలని కార్మికవర్గం డిమాండ్ చేస్తోంది.



బాసర ట్రిపుల్ ఐటీ

## అధ్యాపకుడికి పిహెచ్‌డీ పట్టా

### జాతీయ స్థాయిలో సత్తా చాటిన సాయినాథ్ చైతన్య

**ముథోల్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** విద్యా, పరిశోధనా రంగాల్లో బాసర రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) కీర్తిని ఒక అధ్యాపకుడు జాతీయ స్థాయికి తీసుకెళ్లారు. ట్రిపుల్ ఐటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎ. సాయినాథ్ చైతన్య, ఇటీవల తన పరిశోధనలను పూర్తి చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ప్రతిష్టాత్మక పిహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రానిక్స్, ఐటీ రంగాలలో పరిశోధనలను ప్రోత్సహించేందుకు ప్రవేశపెట్టిన 'విశ్వేశ్వరయ్య పిహెచ్‌డీ స్కీమ్' అభ్యర్థుల ఎంపికలో సాయినాథ్ చైతన్య తన మేధస్సును చాటారు. ఈ పథకం కోసం నిర్వహించిన జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి, అఖిల భారత స్థాయిలో రెండో ర్యాంకును సాధించారు. ఈ ఉత్తమ ర్యాంకు ఆధారంగానే ఆయనకు హైదరాబాదలోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పిహెచ్‌డీ సీటు దక్కింది. సాయినాథ్ చైతన్య తన పరిశోధనను ఓయూ ఈసీఈ విభాగం ప్రొఫెసర్ ఎల్. నిర్మల దేవి పర్యవేక్షణలో పూర్తి చేశారు. "ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్స్ నాణ్యత నియంత్రణను మెరుగుపరచడానికి కంప్యూటర్ విజన్ పద్ధతులు" అనే అంశంపై ఆయన చేసిన పరిశోధన ఎలక్ట్రానిక్ రంగంలో ఎంతో కీలకం కానుంది. పరిశ్రమల్లో ఉత్పత్తి అయ్యే ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుల నాణ్యతను కంప్యూటర్ విజన్ ద్వారా ఎలా పర్యవేక్షించవచ్చో ఆయన తన పరిశోధనలో వివరించారు. ఈ పరిశోధనలో భాగంగా సాయినాథ్ చైతన్య అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఎస్.సి.ఐ, స్కోపస్ ఇండెక్స్ కలిగిన ప్రతిష్టాత్మక జర్నల్స్‌లో పలు పరిశోధనా పత్రాలను ప్రచురించారు. ఆయన కృషిని ఆయా అంతర్జాతీయ విద్యావేత్తలు ప్రశంసించారు.సాయినాథ్ చైతన్య సాధించిన విజయం పట్ల ఆర్‌జీ యూకేటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ ప్రత్యేకంగా అభినందించారు. అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తూనే, జాతీయ స్థాయి పరిశోధనలో సత్తా చాటడం అభినందనీయమన్నారు.

## ఓటరు సమగ్ర డిజిటల్ సర్వేకు సహకారం అవసరం




- బెల్లంపల్లి మండలంలో 66% పూర్తి.. పకడ్బందీగా జన గణన ప్రక్రియ
- వ్యక్తిగత ఆస్తుల వివరాలపై అపోహలు వీడాలి
- సమాచార గోప్యతకు హామీ
- రాజకీయ పార్టీలు బిఎల్‌ఏలను నియమించాలి
- తహసీల్దార్ లవ్య కృష్ణ

**బెల్లంపల్లి, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** రాబోయే 2027 జనాభా గణనలో భాగంగా చేపడుతున్న సమగ్ర డిజిటల్ సర్వే ప్రక్రియ బెల్లంపల్లి మండలంలో వేగవంతంగా సాగుతోంది. ఈ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని బెల్లంపల్లి తహసీల్దార్ లవ్య కృష్ణ, ఎంపీడీవో మహేందర్ పిలుపునిచ్చారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు ఈ సర్వేకు సంబంధించిన కీలక అంశాలను వివరించారు. ప్రస్తుతం చేపట్టిన ఈ సర్వే ప్రక్రియ రెండు విడతలుగా కొనసాగుతుందని, మొదటగా 'కుటుంబ గణన' నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రధాన జన గణన ఉంటుందని, అప్పటి వర కు ఈ ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. బెల్లంపల్లి మండల పరిధిలో ఈ సర్వే కోసం 58 బ్లాకులను విభజించి, 46 మంది సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చామని, వారు క్షేత్రస్థాయిలో పని చేస్తున్నారని చెప్పారు. ఓటర్లు తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే 'స్వీయ గణన' సదుపాయాన్ని కూడా కల్పించామని, ఈ ప్రక్రియ పూర్తయ్యాక వచ్చే 12 అంకెల ఐడిని భద్రపరు చుకోవాలని సూచించారు. సర్వేలో భాగంగా అడుగుతున్న ఆస్తుల వివరాల పట్ల ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకావద్దని అధికారులు స్పష్టం చేశారు. "ఈ జనాభా లెక్కలను ఎట్టి పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలతో ముడిపెట్టి చూడవద్దు. మీరు అందించే సమాచారం అత్యంత గోప్యంగా ఉంటుంది. ప్రభుత్వం పారదర్శకమైన పాలన కోసం మాత్రమే ఈ డేటాను సేకరిస్తోంది" అని తహసీల్దార్ స్పష్టం చేశారు. ఇప్పటికే దేశంలోని 12 రాష్ట్రాల్లో ఈ సర్వే విజయవంతంగా కొనసాగుతోందని వారు గుర్తు చేశారు. బెల్లంపల్లి మండలం మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే 66 శాతం సర్వే ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన పనిని కూడా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ఓటరు నమోదులో బిఎల్వోలు నిమగ్నమై ఉన్నారని, వారికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. అలాగే, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లు తమ తల్లిదండ్రుల వివరాలను ఆధారంగా చేసుకుని కొత్తగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. రాజకీయ పార్టీలు కూడా తమవంతు బాధ్యతగా బిఎల్‌ఏల జాబితాను అందించాలని కోరారు. ఓటర్లు తప్పనిసరిగా వెబ్‌సైట్‌లో మ్యాపింగ్ చేసుకోవాలని సూచించారు.

# మహిళలు, పిల్లల రక్షణే ప్రధాన ధ్యేయం

- 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మే 6 వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- రాజంపేట, జిల్లా కేంద్రంలోని విద్యాసంస్థల్లో రక్షణ చట్టాలపై విస్తృత ప్రచారం
- ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చిన పోలీసు అధికారులు



**ఆసిఫాబాద్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** మహిళలు,పిల్లల రక్షణే ప్రధాన ధ్యేయంగా జిల్లా పోలీస్ శాఖ పనిచేస్తుందని ఎస్పీ నితికా పంత్ అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా ప్రజలకు, బాలి కలకు, మహిళలకు, యువతకు అవగాహన కార్యక్రమాల నిర్వహణ ఫ్లెక్సీని సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేటి నుండి మే 6 వరకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వ హించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ బుద్దె స్వామి, భరోసా కేంద్రం సబ్ ఇన్స్పెక్టర్ దివ్య, షీ టీమ్ ఎస్సై బిక్కులాల్, షీ టీమ్, భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జిల్లాకేంద్రంలోని బ స్టాండ్, ఆదర్శ క్రీడా పాఠశాలలో మండలంలోని రాజంపేట లో మహిళలు, పిల్లల రక్షణపై అవగాహన కల్పించారు. షిటీం ఎస్సై బిక్కులాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.కార్యక్రమంలో ఎస్సైలు బొజ్జిరావు, బిజుమన్, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.



## దోస్త్ హెల్ప్ డెస్క్ ప్రారంభం

**లక్సెట్టిపేట, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** దోస్త్ (డిగ్రీ ఆన్లైన్ సేవలు తెలంగాణ) హెల్ప్ డెస్క్ను లక్సెట్టిపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహాత్మా సంతోష్ సోమవారం ప్రారంభించారు. విద్యార్థులు డిగ్రీ ప్రవేశా లకు సంబంధించిన సందేహాలు నివృత్తి చెసుకోవ దానికి ఉపయోగించుకోవాలని కోరారు. హెల్ప్ డెస్క్ ఇంచార్జిగా చరిత్ర అధ్యాపకులు సల్ల శ్రీనివాస్ వ్యవహ రించనున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్ర మంలో అధ్యాపకులు జాడి శంకరయ్య, పి. స్వామి, టి.సతీష్, ఎం. మహేష్ కుమార్ పాల్గొన్నారు.

### నిర్మల్ జిల్లాతో అనుబంధాన్ని

## ఎప్పటికీ మరువ లేనది



**నిర్మల్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** నిర్మల్ జిల్లా కలెక్టర్గా తాను దాదాపు రెండు సంవత్సరాలు పనిచేశానని ఇక్కడి ప్రజలు అధికారులు తమకు సంపూర్ణ సహకారం అందించి జిల్లా అభివృద్ధికి పాటు పడ్డారని ఈ అనుబంధం ఎప్పటికీ మరువవని బదిలీపై వెళ్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. ఇంటర్ బోర్డు బోర్డు కార్యదర్శిగా నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్ చక్రవర్తి స్థానిక కౌన్సిలర్లు సన్మానం చేసి అభినందించారు. జిల్లాలో కౌన్సిలర్లు గోపి గోపీనాథ్ శనిగరపు నరేష్ హరీష్ రాజు కత్తి నరేందర్ పెండెం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

### ఫీజు రీయింబర్స్మెంట్

## చెల్లించాలని వినతి

**మంచిర్యాల, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లిం చాలని కోరుతూ సోమవారం మంచిర్యాల జిల్లా బీఆ ర్ఎస్వీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో కలెక్టర్ ఏఓ రాజే శ్వర్కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బడికెల శ్రావణ్, మంచిర్యాల నియోజకవర్గ అధ్యక్షులు దగ్గుల మధు కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 8వేల కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించకపోవ డం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఎన్ని కల ముందు రేవంత్రెడ్డి గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే చెల్లిస్తామ ని హామీ ఇచ్చి రెండున్నర సంవత్సరాలు దాటిన ఇప్పట వరకు చెల్లించలేదని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు ఆడెపు అరుణ్ ప్రసాద్, మంచిర్యాల జిల్లా నాయకులు మహమ్మద్ సాజిద్ చోటు, తిరుపతి, నడిపెల్లి నవదీప్, బెల్లం అరుణ్, ముస్తాఫా, మెహరన్, కృష్ణ పాల్గొన్నారు.



# బోథ్ రాజకీయాలపై అధిష్టానం కన్ను



- **టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్తో ఆడే గజేందర్ భేటీ!**
- **హైదరాబాద్ గాంధీ భవన్లో కీలక రాజకీయ చర్చలు**
- **బోథ్ అభివృద్ధి, పార్టీ బలోపేతంపై అధిష్టానానికి వివరించిన నియోజకవర్గ ఇంచార్జి**
- **స్థానిక సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరిన ఆడే గజేందర్**

**బోథ్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** బోథ్ నియోజకవర్గ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేం దర్, సోమవారం హైదరాబాద్లోని గాంధీ భవన్లో తెలం గాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్తో సమావేశమయ్యారు. ఈ భేటీ రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. సుమారు కొంత సమయం పాటు జరిగిన ఈ భేటీలో, బోథ్ నియోజకవర్గంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులు, పార్టీ సంస్థాగత బలోపేతం, మరియు క్షేత్రస్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలలో ఉత్సాహాన్ని నింపేందుకు, రానున్న రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి గజేందర్ టీపీసీసీ అధ్యక్షుడికి వివరించారు. కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి పెండింగ్లో ఉన్న పలు అంశాలను, ప్రజా సమస్యలను గజేందర్ టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభావాన్ని పెంచేలా, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలని ఈ సందర్భంగా అధ్యక్షులు సూచించి నట్లు సమాచారం. అధిష్టానం అండగా ఉంటుందని, క్షేత్రస్థాయిలో కష్టపడే నాయకులకు, కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో బోథ్ నియోజకవర్గ పరిధిలోని ముఖ్య కాంగ్రెస్ నాయకులు గజేందర్తో పాటు పాల్గొని, నియోజకవర్గ పరిస్థితులను అధ్యక్షుడికి వివరిం చారు. ఈ భేటీతో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

# గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలి

**కాగజ్నగర్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** భారతీయ సంస్కృతి, సంప్రదాయాలలో గోవుకు విశిష్టమైన స్థానం ఉందని, అటువంటి పవిత్రమైన గోవును 'జాతీయ ప్రాణి'గా ప్రకటించాలనే డిమాండ్ మరోసారి తెరపైకి వచ్చిం ది. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఉద్యమంలో భాగంగా, కాగజ్నగర్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు ఏకమై తమ నిరస నను, విన్నపాన్ని తెలియజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాల యం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో వందలాది మంది ప్రజలు పాల్గొని తమ మద్దతును తెలిపారు. గోవు కేవలం ఒక జంతువు మాత్రమే కాదని, అది భారతీయ జీవన విధానంలో ఒక భాగమని ఆందోళనకారులు స్పష్టం చేశారు. గోవధను అరికట్టాలని, దేశవ్యాప్తంగా గోవధ నిషేధాన్ని కఠినంగా అమ లు చేయాలని వారు గట్టిగా డిమాండ్ చేశారు. ఈ మేరకు సుమారు వెయ్యి మంది సంతకాలతో సేకరించిన వినతి పత్రా న్ని వారు అధికారులకు సమర్పించారు. ప్రభుత్వాలు స్పం దించి, తక్షణమే ఈ నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాగజ్నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్



అనిత, అశోక్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ.. గోవును జాతీయ ప్రాణిగా గుర్తించడం ద్వారా, మన సంస్కృతిని కాపాడుకోవడమే కా కుండా, పశుసంపదను పరిరక్షించుకోవచ్చని అభిప్రాయపడ్డా రు. ఈ విషయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూల నిర్ణ యం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అధికారులకు వినతి పత్రం అందజేసిన అనంతరం, వారు ఈ ఉద్యమం కొనసా గుతుందని, ప్రజలందరూ ఏకతాటిపై నిలిచి గోరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.



### ఫింగర్ప్రింట్ విభాగం నూతన ఎస్పీగా

## ప్రవీణ్ కుమార్ బాధ్యతల స్వీకరణ

- ఎస్పీఅఖిల్ మహాజన్ను కలిసిన నూతన అధికారి
- నేర దర్యాప్తులో ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని ఎస్పీ దిశానిర్దేశం

**ఆదిలాబాద్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** జిల్లా పోలీసు విభాగంలోని కీలకమైన 'ఫింగర్ప్రింట్' విభాగం నూతన ఎస్పైగా బి. ప్రవీణ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. కామారెడ్డి నుండి బదిలీపై ఆదిలాబాద్కు వచ్చిన ఆయన, సోమవారం స్థానిక జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి పూల మొక్కను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. నూతన ఎస్పైకి శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ అఖిల్ మహాజన్, విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించాలని సూచించారు. నేర దర్యాప్తులో ఫింగర్ప్రింట్ విభాగం అత్యంత కీలకమై నదని గుర్తు చేస్తూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని నిరంతరం అప్డేట్ చేసుకుంటూ నేరస్తులను త్వరిత గతిన పట్టుకునేలా కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు ఇక్కడ బాధ్యతలు నిర్వ హించిన ఎస్పై పి. శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. ఆయన మెదక్ ఫింగర్ప్రింట్ బ్యూరోకు బదిలీ కాగా, ఆయన స్థానంలో ప్రవీణ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు.

## హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవాలి

**నిర్మల్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):** వచ్చే నెల 3న జరగనున్న టిజీఆర్జెసి సెట్ 2026 పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వారు వెంటనే హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవాలని ఉమ్మడి జిల్లా జిల్లా కన్వీనర్ సోఫినగర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ డానియల్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల కొరకు టీజీఆర్జెసి కళాశాలలో ప్రవేశాలకు ఈ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు నిర్వ హించే పరీక్షకు మొత్తం 76126 విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. పరీక్ష సమయానికి అరగంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. అన్ని జిల్లా కేంద్రాల్లో మే 3న ఈ పరీక్ష ఉంటుందని తెలిపారు.

# 1 నుంచి మున్సిపాలిటీలో ప్లాస్టిక్ నిషేధం



- పట్టణాన్ని క్లీన్ సిటీగా ఉంచాలి
- మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్

**ఆదిలాబాద్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):**
ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో మే 1 తేదీ నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం నిషేధం అమల్లోకి రానుందని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ వెల్లడించారు. పట్టణాన్ని పర్యావరణహితంగా తీర్చిదిద్దేందుకు మున్సిపాలిటీ నడుం బిగించిందన్నారు. కార్యాలయంలోని తన చాంబర్‌లో అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనుష మాట్లాడుతూ. ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో సింగిల్ యూజ్ (ఒక్కసారి వాడి పారేసే) ప్లాస్టిక్కు పూర్తిగా నిషేధిస్తున్నట్లు తెలిపారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు స్ట్రాలు, ప్లాస్టిక్ జెండాలకు ప్రజలు దూరంగా ఉండాలని వాటిని పూర్తిగా నిషేధిస్తున్నామని వెల్లడించారు. ప్లాస్టిక్ వల్ల డ్రైనేజీలు పూడిపోవడమే కాకుండా భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాపారులు, ప్రజలు స్వచ్ఛందంగా సహకరించి ప్లాస్టిక్ రహిత ఆదిలాబాద్‌ను రూపొందించాలని కోరారు. పట్టణంలోని కిరాణా దుకాణాలు, హోటళ్లు, కూరగాయల మార్కెట్లలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తామన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ప్లాస్టిక్ విక్రయించినా భారీ మొత్తంలో జరిమానాలు విధిస్తమని స్పష్టం చేశారు. షాపింగ్‌కు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా బట్ట సంచులు వెంట తీసుకెళ్లాలని, శుభకార్యాల్లో ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ ప్లేట్లకు బదులు స్టీల్ లేదా విస్తరాకులు వాడాలని, పరిసరాల పరిశుభ్రత కోసం తడి, పొడి చెత్తను వేరువేరుగా మున్సిపల్ వాహనాలకు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పట్టణాన్ని క్లీన్ సిటీగా ముందంజలో ఉంచేందుకు ప్రతి పౌరుడు బాధ్యతగా మెలగాలని మున్సిపల్ యంత్రాంగం విజ్ఞప్తి చేసింది. అదేవిధం గా మున్సిపాలిటీలో విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత పది రోజులుగా మున్సిపల్ వార్డ్ ఆఫీసర్లు, మున్సిపల్ ఎలక్ట్రిసిటీ అధికారులు పట్టణంలోని 49 వార్డులలో అవసరమైన రిక్వైర్మెంట్లను ఎలక్ట్రిసిటీ విద్యుత్ అధికారులకు ఇవ్వడం జరిగిందన్నారం పట్టణంలోని పలు వార్డుల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. వీధి దీపాల నిర్వహణలో భాగంగా పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత వీధుల్లో స్ట్రీట్ లైట్ థర్డ్ వైర్లను వెంటనే పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. విలీన గ్రామపంచాయతీ పరిధిలలో థర్డ్ వైరు నిర్వహణ కొరకు మున్సిపాలిటీ నుండి డబ్బులు చెల్లించడానికి సిద్ధం గా ఉన్నామని తెలపడం జరిగింది. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్లు (ఏఈ) వినోద్, సదానందం, మున్సిపల్ డిఈ కార్తీక్, ఏఈ నితిన్, కిరణ్,మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ శంకర్, మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్‌ను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం




- నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల
- గంజాయి రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం
- 'గంజాయి గస్తీ' కార్యక్రమానికి శ్రీకారం
- యువతను మాదక ద్రవ్యాల బారి నుంచి కాపాడేందుకు పోలీసుల ప్రత్యేక కార్యాచరణ
- జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన నిఘా..
- విక్రయదారుల వివరాలు చెబితే గోప్యతకు హామీ

**నిర్మల్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):**
జిల్లాలో మాదక ద్రవ్యాల కట్టడికి పోలీసు యంత్రాంగం యుద్ధం ప్రకటించింది. నిర్మల్ జిల్లాను 'గంజాయి రహిత జిల్లా'గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కఠిన చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ జానకి షర్మిల స్పష్టం చేశారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆమె 'గంజాయి గస్తీ' బ్యానర్‌ను ఆవిష్కరించి, ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో ఎక్కడైనా గంజాయి సాగు, రవాణా లేదా విక్రయాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గంజాయి అనేది యువత భవిష్యత్తును నాశనం చేసే మహమ్మారి అని, దీనిని నిర్మూలించే బాధ్యతను పోలీసు శాఖ భుజాన వేసుకుందని ఆమె పేర్కొన్నారు. జిల్లాలో గంజాయి వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించామని, విక్రయదారుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచామని తెలిపారు. గంజాయి విక్రేతలు, రవాణాదారులను పట్టుకునేందుకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలను ముమ్మరం చేశామని ఎస్పీ తెలిపారు. కేవలం తనిఖీలే కాకుండా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. గంజాయి వల్ల కలిగే అనర్థాలపై యువతకు, విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు కూడా చేపడుతున్నట్లు ఆమె వివరించారు. ఈ గంజాయి రహిత ఉద్యమంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఎస్పీ పిలుపునిచ్చారు. తమ ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నా, గంజాయి విక్రయాలు జరుగుతున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఆమె భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సాయికిరణ్‌తో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఎల్లపల్లిలో బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

**నిర్మల్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):**
నిర్మల్ గ్రామీణ మండలం ఎల్లపల్లి గ్రామంలో జరగాల్సిన ఒక బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. గ్రామంలో బాల్య వివాహం జరుగుతుందన్న సమాచారం అందుకున్న అధికారులు వెంటనే స్పందించి, సమయానికి చేరుకొని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, బాల్య వివాహ నిరోధక చట్టం-2006' ప్రకారం18 ఏళ్ల లోపు బాలికలకు, 21 ఏళ్ల లోపు బాలురకి వివాహం చేయడం నేరం అని వివరించారు. ఈ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పిల్లల భవిష్యత్తు కోసం వారి విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు. బాల్య వివాహాన్ని అడ్డుకున్న వారిలో జిల్లా బాలల సంరక్షణ అధికారిణి దేవి, మురళి, సూపర్వైజర్ మంగళ, సమన్వయకర్తలు నల్ల గంగాధర్, సుప్రియ, శ్రీదేవి, పద్మావతి, తదితరులు ఉన్నారు.

## సీడీపీఓపై విచారణ జరపాలి

**ముథోల్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):**
ముథోల్ నియోజకవర్గం పనిచేస్తున్న సీడీపీఓపై విచారణ జరపాలని అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సిఐటియూ నాయకులు జిల్లా కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సీడీపీఓ ఆ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తుందని సెలవుల డబ్బులను తమ ఖాతాలో వెయ్యాలని డిమాండ్ చేస్తుందని వారు ఆరోపించారు. వేధింపులకు గురి చేస్తుందని వెంటనే ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఉన్నారు.



# 'మండే' సూర్యుడు

- 44 డిగ్రీలకు చేరుతున్న ఉష్ణోగ్రతలు
- మధ్యాహ్నం సమయంలో ఎండ ప్రభావం తీవ్రతరం
- పది గంటల నుంచే వేడెక్కుతున్న వాతావరణం

**(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)**
సూర్య ప్రతాపం కారణంగా వారం పది రోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. విపరీతమైన దాహార్తితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎండలు రోజు రోజుకు మండిపోతుండడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సూర్యుడు తన ప్రతాపం చూపిస్తుండడంతో మధ్యాహ్నం సమయంలో ప్రజలు ఇళ్లకే పరిమితం కావలసి వస్తోంది. సాధారణంగా మే నెలలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయి. అందుకు భిన్నంగా ఏప్రిల్‌లోనే ఎండలు తీవ్ర రూపం దాల్చుతున్నాయి. జిల్లాలో క్రమేపీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో వాతావరణశాఖ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇళ్ల నుంచి బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం సమయంలో రోడ్లపై జనసంచారం పూర్తిగా తగ్గుముఖం పడుతోంది. ఎండలు తీవ్రతరం కావడంతో భూగర్భజలాలు తగ్గుముఖం పడుతున్నాయి. ఈ కారణంగా గోదావరి నదిలో పూర్తిగా నీరు అడుగంటి పోగా బోర్లలో సైతం లోతుల్లోకి వెళ్లాయి. గోదావరిలో నీరు అడుగంటి పోతుండటంతో దాని ప్రభావం నది పరివాహక ప్రాంతాల్లోని బోర్లపైన పడుతోంది. ఎండల ప్రభావం వ్యవసాయ రంగంపైనా పడే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలోని దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో సుమారు 3వేల ఎకరాలకు యాసంగికి గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా నీరు అందుతోంది. అయితే లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో కొంతమేర మాత్రమే గూడెం ఎత్తిపోతల నీరు అందుతుండగా, మిగితా ప్రాంతాల్లో రైతులు బోర్లపైనే ఆధారపడి సాగు చేస్తారు. ముఖ్యంగా గోదావరి పరివాహక ప్రాంతాల రైతులు నదిలో మోటార్లు ఏర్పాటు చేసుకొని పంటలు సాగు చేస్తారు. ప్రస్తుతం నది ఎండి పోతుండటంతో ఆ ప్రభావం యాసంగి సాగుపైన చూపనుంది.

**పనివేళల్లో మార్పు తప్పనిసరి...**
జిల్లాలోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి సింగరేణి ఏరియాలలోని ఓపెన్ కాస్టు, అండర్ గ్రౌండ్ మైన్‌లలో విధులు నిర్వహించే కార్మికులు పెరిగిన ఎండల కారణంగా ఇబ్బందులు పడే అవకాశాలు ఉండటంతో పనివేళల్లో మార్పులు చేయడం తప్పనిసరిగా మారింది. ముఖ్యంగా మిడిల్ షిఫ్ట్, ఉదయం షిఫ్ట్‌ల్లో విధులు నిర్వహించే కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. ఫస్ట్ షిఫ్ట్ వెళ్లే కార్మికులు మధ్యాహ్నం రెండు గంటలకు విధులు ముగించుకొని ఇంటికి రావాల్సి ఉండగా, మిడిల్ షిఫ్ట్ వెళ్లేవారు మధ్యాహ్నం ఒంటి గంటకు బయలు దేరాల్సి ఉంటుంది. ఈ క్రమంలో విధులకు హాజరయ్యే వారు, విధుల నుంచి తిరిగి వచ్చే వారు ఎండ తీవ్రతకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికిప్పుడు గనుల్లో హాజరు శాతం తగ్గకపోయినా రాబోయే రోజుల్లో ఎండలు తీవ్రతరం కానుండగా, హాజరు శాతంపై ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎండల వేడిమి కారణంగా విధులు నిర్వహించేందుకు కార్మికులు ఆసక్తి చూపడంలేదు. కార్మికుల అవస్థలు దృష్టిలో పెట్టుకొని సింగరేణి ఉన్నతాధికారులు షిఫ్ట్‌ల వేళల్లో మార్పులు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. క్రమేపీ పెరుగుతున్న ఉష్ణోగ్రతల ఉక్కపోత కూడా అధికంగా ఉంటోంది. ఇండ్ల లోనూ ఉక్కపోతలు ప్రారంభమవుతున్నాయి. ఫ్యాన్లు, కూలర్లలో ఇప్పటి నుంచే వేడి గాలులు వస్తున్నాయి. కూరగాయలు, ఇతర చిరు వ్యాపారులు ఎండవేడిమి భరించలేకపోతున్నారు. రోడ్లపక్కన గొడుగులు ఏర్పాటు చేస్తూ తాత్కాలిక ఉపశమనం పొందుతున్నారు. విపరీతమైన వేడిమి కారణంగా ప్రజలు తాగు నీటి కోసం తహతహలాడుతున్నారు. పగటి పూట వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లే వారు రోడ్ల పక్కన ఉండే సోడా, జ్యూస్ సెంటర్ల వద్ద సేద తీరుతున్నారు. గడిచిన ఆరు రోజుల్లో జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 22న దండేపల్లి మండలం వెల్గనూరులో 43.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే 23న కాసిపేట మండలం కొండాపూర్‌లో 44.2, 24న దండేపల్లి మండలం వెల్గనూరులో 43.7, 25న కాసిపేట మండలం కొండాపూర్‌లో 44.3, 26న కన్నెపల్లి మండలం జన్కాపూర్‌లో 44 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తాజాగా సోమవారం భీమారం మండలంలో 45.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదుకాగా, నస్పూర్‌లో 45.4, కన్నెపల్లి మండలం జన్కాపూర్‌లో 45.3, దండేపల్లి మండలం వెల్గనూర్‌లో 45.2, దండేపల్లి మండలం లింగాపూర్‌లో 45, లక్షెట్టిపేట మండలం శాంతాపూర్‌లో 44.8, జైపూర్ మండలం కుందారంలో 44.6, పాత మంచిర్యాలలో 44.5, జన్నారంలో 44.4, చెన్నూర్ మండలం కొమ్మెంలో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



# థియేటర్‌లో ఏడ్చేసిన అమీర్ ఖాన్..

బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ హీరోగా నటించిన చిత్రం ఏక్ దిన్ . రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని సునీల్ పాండే డైరెక్ట్ చేస్తుండగా.. సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ మూవీని మే 1న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది అమీర్ ఖాన్ అండ్ టీం.కాగా ఈ మూవీ స్పెషల్ స్క్రీనింగ్స్‌కు అమీర్ ఖాన్ సాయిపల్లవి అండ్ టీంతో కలిసి హాజరయ్యాడు అమీర్ ఖాన్. సినిమా చూస్తున్న టైంలో తన కొడుకు జునైద్ ఖాన్ నటన చూసి భావోద్వేగానికి లోనయ్యాడు. సినిమాలోని సాంగ్ చూస్తూ కంటతడి పెట్టిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. పక్కనే సాయిపల్లవి, జునైద్ ఖాన్‌ను కూడా చూడొచ్చు.ఈ చిత్రాన్ని అమీర్ ఖాన్‌ప్రొడక్షన్స్‌పై మన్సూర్‌ఖాన్, అమీర్ ఖాన్, అపర్ణ పురోహిత్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.







# వెబ్ సిరీస్‌లో దువ్వాడ మాధురి

'చీన్ టపాక్ డుం డుం' అనే ఆసక్తికరమైన టైటిల్‌తో ఒక కొత్త తెలుగు సినిమా ప్రారంభమైంది. 'శుభం' సినిమా, 'కుమారి శ్రీమతి' వంటి అమెజాన్ ప్రైమ్ సిరీస్‌ల ద్వారా గుర్తింపు తెచ్చుకున్న గవిరెడ్డి శ్రీనివాస్ ఈ సినిమాలో హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమా పూర్తిగా కామెడీ ఎంటర్టైనర్‌గా రూపొందుతోంది.ఈ చిత్ర ప్రారంభ కార్యక్రమం ఎంతో ఘనంగా జరిగింది. పలువురు సినీ ప్రముఖులు ఈ వేడుకకు హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ముహూర్తపు షాట్‌కు ప్రముఖ హీరోయిన్ సమంత క్లాప్ కొట్టారు. దర్శకుడు గోపిచంద్ మలినేని మొదటి షాట్‌ను డైరెక్ట్ చేశారు. మల్లిడి వశిష్ట కెమెరా ఆన్ చేశారు. నందిని రెడ్డి, బీవీఎస్ రవి, గౌతమి కలిసి స్క్రిప్ట్‌ను అందించి సినిమా ప్రారంభించారు. ఈ చిత్రాన్ని శ్రీను నాగులపల్లి నిర్మిస్తున్నారు. ఆయన 'విలేజ్ టాకీస్' బ్యానర్‌పై ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇది ఆయన నిర్మిస్తున్న మొదటి సినిమా కావడం విశేషం. ఈ సినిమాకు వై.ఎన్ లోహిత్ దర్శకత్వం వహిస్తున్నారు. హీరోయిన్‌గా బ్రిగిడా సాగా నటిస్తున్నారు. అలాగే ఈ సినిమాలో దువ్వాడ మాధురీ కూడా ఓ విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. టెక్నికల్ టీమ్ కూడా బలంగా ఉంది. ఆర్ట్ డైరెక్టర్‌గా ఏ.ఎస్. ప్రకాష్ పని చేస్తున్నారు. సినిమాటోగ్రఫీ బాధ్యతలను సెంథిల్ కుమార్ తీసుకున్నారు. పీఆర్ మ్యూజిక్ సంగీతం అందిస్తున్నారు. పాటలను తిరుపతి జావానా రాస్తున్నారు. ఈ చిత్ర కథ, స్క్రీన్‌ప్లేలను దివ్య తేజస్వి, విక్రమ్ కుమార్ కె, నాగ్ ట్రైల్‌బ్లేజర్, ఏకలవ్య కలిసి రూపొందించారు.ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ నర్సీపట్నం, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో వేగంగా జరుగుతోంది. చిత్ర బృందం ఈ సినిమాను ఆగస్టు నెలలో విడుదల చేయాలని ప్లాన్ చేస్తోంది. వినోదం ఎక్కువగా ఉండే ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చిత్ర యూనిట్ నమ్మకం వ్యక్తం చేస్తోంది.



# యాక్షన్ మోడ్‌లోకి సంయుక్త మీనన్..

మోస్ట్ బ్యూటిఫుల్ అండ్ టాలెంటెడ్ నటి సంయుక్త మీనన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ది బ్లాక్ గోల్డ్'. యోగేష్ KMC దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా నిర్మిస్తున్నారు. సామ్ CS ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాలో సంయుక్త మీనన్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతోంది. తాజాగా ఈ మూవీ బృందం సినిమాకు సంబంధించిన ఒక క్రేజీ అప్డేట్‌ను అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాకు సంబంధించిన ఆఖరి షెడ్యూల్ తాజాగా పూర్తి అయినట్లు మూవీ యూనిట్ ప్రకటించింది. ఇక ఈ సినిమాను ఈ ఏడాది సమ్మర్‌లో విడుదల చేసే ఆలోచనలో మూవీ మేకర్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మూవీ మంచి విజయం సాధించినట్లయితే సంయుక్త మీనన్‌కు అద్భుతమైన గుర్తింపు దక్కే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరి ఈ మూవీ ఏ స్థాయి విజయాన్ని సొంతం చేసుకుంటుందో చూడాలి.



# సాయి పల్లవి తప్ప మరో ఆలోచన లేదు

భారతరత్న ఎం.ఎస్. సుబ్బలక్ష్మి గారి జీవిత చరిత్రను వెండితెరపై ఆవిష్కరించేందుకు రంగం సిద్ధం అయిన విషయం తెలిసిందే. ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తుండగా.. ఇందులో సుబ్బలక్ష్మి గారి పాత్రలో నేచురల్ బ్యూటీ సాయి పల్లవి నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే.. సాయి పల్లవి ప్రస్తుతం 'రామాయణ'తో పాటు పలు ప్రాజెక్టులతో బిజీగా ఉండటంతో.. కాల్‌షీట్ల సమస్య కారణంగా ఈ ప్రాజెక్టు నుంచి ఆమె తప్పుకున్నట్లు గత కొద్ది రోజులుగా వార్తలు వైరల్ అవుతూనే ఉన్నాయి. అలాగే.. సాయి పల్లవి ప్లేస్‌లో కోలీవుడ్ బ్యూటీ రుక్మిణి వసంత్‌ను తీసుకున్నట్లు కూడా నెట్టింట పుకార్లు షాకార్లు చేశాయి.అయితే.. తాజాగా నిర్మాత బన్నీవాసు ద్వారా అందిన సమాచారం మేరకు..'ఎం.ఎస్ సుబ్బలక్ష్మి పాత్రకు సాయి పల్లవి తప్ప మరో ఆలోచన లేదు. ఆమెను మార్చామనే వార్తలన్నీ కేవలం ఫేక్ న్యూస్ మాత్రమే. ఈ పాత్రకు ఆమె వంద శాతం న్యాయం చేయగలదని టీమ్ బలంగా నమ్ముతోంది. రుక్మిణి వసంత్‌ను తీసుకున్నామనే దాంట్లో అస్సలు నిజం లేదు' అని చెప్పారు. కాగా.. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులతో బిజీగా ఉన్న ఈ చిత్రం అక్టోబర్ 2026 నుంచి సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉందని టీమ్ క్లారిటీ ఇచ్చింది. ఈ క్లాసికల్ బయోపిక్‌కు రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించబోతున్నారు.






# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

- మంత్రుల స్పష్టమైన ఆదేశాలు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష
- ఏ ఫైలు కూడా అధికారుల వద్ద వారం రోజుల కంటే ఎక్కువ పెండింగ్‌లో ఉండొద్దు
- నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షించాలి

**ఆదిలాబాద్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):**
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, క్షేత్రస్థాయిలో పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. హిమాయతనగర్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల ఆత్మగౌరవ ప్రతీక. నిర్మాణ ప్రక్రియలో అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. లబ్ధిదారుల దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టవద్దు. ఏ ఒక్క ఫైలు కూడా అధికారుల వద్ద వారం రోజుల కంటే ఎక్కువ సమయం ఉండకూడదు అని స్పష్టం చేశారు. సిబ్బంది కొరత ఉంటే తక్షణమే అధికారులను డిప్యుటేషన్‌పై తెచ్చుకొని పనులను పరుగులు పెట్టించాలని సూచించారు. ప్రతి దశలోనూ పనులను 'క్లోజ్లీ మానిటర్' చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. స్థోమత లేని నిరుపేద లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాలు లేదా బ్యాంకుల నుంచి రుణం అందేలా చర్యలు తీసుకోవాలని, దశల వారీగా హౌసింగ్ కార్పొరేషన్ నుంచి మంజూరయ్యే నిధుల ద్వారా రుణం తీర్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో ఎంపీలు గడ్డం నగేష్, గడ్డం వంశీ, ఎమ్మెల్సీలు దండే విఠల్, అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వినోద్, రామారావు పటేల్, పాయల శంకర్, వెడ్మ బొజ్జు, పాల్వాయి హరీశ్ బాబు తదితరులు పాల్గొని జిల్లాలోని సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ లోకేష్ కుమార్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ హరిత, నిర్మల్ కలెక్టర్ భవేశ్ మిశ్రా, మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జిల్లాల వారీగా ఇళ్ల మంజూరు, పురోగతి, ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.

# మా బంగారం ఎప్పుడిస్తరు సారూ..?



- చెన్నూర్ ఎస్‌బీఐ బ్రాంచ్-2లో గోల్డ్‌లోన్ బాధితుల నిరసన
- బ్యాంకులో అధికారులతో గోల్డ్‌లోన్ బాధితుల వాగ్వాదం..
- తొమ్మిది నెలలు గడుస్తున్నా న్యాయం చేయడంలేదని ఆవేదన

**చెన్నూర్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):**
చెన్నూర్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్-2లో లోన్ కోసం తనఖా పెట్టిన బంగారం తమకు ఎప్పుడిస్తరని అధికారులను బాధితులు ప్రశ్నించారు. ఈ మేరకు బాధితులు చెన్నూర్‌లోని ఎస్‌బీఐ బ్రాంచ్ 2లో సోమవారం ఆందోళన చేపట్టారు. అధికారులతో వాగ్వాదానికి దిగారు. తొమ్మిది నెలలుగా తమ బంగారం ఇవ్వకుండా బ్యాం కు అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకు మేనేజర్‌తో పాటు సంబంధిత అధికారులను ప్రశ్నించారు. అనంతరం గోల్డ్‌లోన్ బాధితులు మాట్లాడారు. సెప్టెంబర్ 11, 2025న తాము రాతపూర్వకంగా అభ్యర్థన అందజేశామని, విచారణ కొనసాగుతున్నదని, విషయాలు తర్వాత వెల్లడిస్తామని బ్యాంకు మేనేజర్ సమాధానం ఇచ్చినట్లు పేర్కొన్నారు. దాదాపు తొమ్మిది నెలలు గడుస్తున్నా ఈ విషయంలో ఇప్పటి వరకూ ఏ విధమైన స్పష్టత ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రికవరీ అయిన బంగారం బ్యాంకు కస్టడీకి ఇచ్చారని చెబుతున్నారు కానీ, దానికి అధికారికంగా రుజువు చూపడంలేదని తెలిపారు. ఒకవేళ బంగారం మొత్తం రికవరీ అయ్యి, బ్యాంకు కస్టడీలోనే ఉన్నప్పుడు ఖాతాదారుల బంగారాన్ని వారికి ఎప్పుడు అందజేస్తారనే విషయాన్ని రాతపూర్వకంగా స్పష్టం చేయాలన్నారు. ఇప్పటి వరకూ ఇచ్చిన హామీలేవీ నెరవేరలేదని, దీంతో నమ్మకం కోల్పోయామని బాధితులు పేర్కొన్నారు. ఇకనైనా బంగారం ఎప్పుడిస్తరో స్పష్టత ఇవ్వాలని కోరారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి సామాజిక స్పృహతో స్పందించే ఉత్సహం, అవినీతి, అక్రమాలు వెలికితీసే ధైర్యం, ప్రశ్నించే తత్వం ప్రజా సమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా.. ఆ అవకాశాన్ని ప్రభాత సమాచారం దినపత్రిక కల్పిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని మండల కేంద్రాల్లో, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో విలేకరులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
సయ్యద్ కరీం, ఎడిటర్ - ప్రభాత సమాచారం తెలుగు దినపత్రిక
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

## గంగాపూర్ పంచాయతీ
# కార్యదర్శిపై కలెక్టర్ వేటు

**కాగజ్‌నగర్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):**
ఉపాధి హామీ నిధుల చెల్లింపులో అసలైన వారికి కాకుండా ఇతరులకు తరలించి అక్రమాలకు పాల్పడి, విధుల పట్ల నిర్లక్ష్యం వహించాడు చింతలమానెపల్లి మండలం గంగాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి అశోక్. కాగా తాజాగా అతడిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కె.హరిత శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్ల బిల్లుల చెల్లింపులో అక్రమాలు జరిగినట్లు కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపించిన కలెక్టర్, అక్రమాలు జరిగినట్లు నిర్ధారించారు. పనులు చేసిన అసలైన లబ్ధిదారులకు కాకుండా, నిబంధనలకు విరుద్ధంగా నిధులను ఇతర వ్యక్తుల ఖాతాలకు మళ్లించినట్లు విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ప్రభుత్వ నిధుల వినియోగంలో పారదర్శకత ఉండాలని, బాధ్యతారాహితంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బిల్లుల చెల్లింపులు, సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఆమె స్పష్టం చేశారు.

# పోడు భూములకు పట్టాలివ్వాలి

## ఐటీడీఏ ఎదుట గ్రామీణ పేదల సంఘం ఆందోళన

**ఉట్నూర్, ఏప్రిల్ 26 (ప్రభాత సమాచారం):**
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నేతావత్ రాందాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి వెంకటాద్రి డిమాండ్ చేశారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని సోమవారం మండలంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఐటీడీఏ ఏపీవో జాదవ్ వసంతరావుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభివృద్ధి పేరుతో, పర్యావరణ పేరుతో, అడవుల సంరక్షణ పేరుతో, హరితహారం పేరుతో, గిరిజనుల భూములలో మొక్కలు నాటడం, కందకాలు తవ్వడం వంటి చర్యలతో పోడు రైతుల సాగు భూముల నుండి తరిమి వేయడానికి ప్రయత్నిస్తున్నరన్నారు. గిరిజనులకు 1/70, అడవి హక్కు చట్టాలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. ప్రతి సంవత్సరం పోడు వ్యవసాయం చేసే గిరిజనులపై ఫారెస్ట్ అధికారులు, పోలీస్ బలగాలుల దాడులతోనే వారికి తొలకరి ప్రారంభమవుతున్నదన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో టైగర్ జోన్‌తో అనేక గ్రామాల ప్రజలను ప్రభుత్వాలు అనేక ఎత్తుగడులతో మభ్యపెట్టి గ్రామాలను ఖాళీ చేయించి ప్రజలను రోడ్డున పడేస్తున్నారని పేర్కొన్నారు. ఏజెన్సీలో ఏరియాలో గిరిజనులకు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం, ఇందిరమ్మ ఇల్లు, రోడ్డు సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు కుటికెల శంకర్, ఉపాధ్యక్షులు సిడం ధర్మం, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ధారంగుల ఎల్లయ్య, ఉపాధ్యక్షులు ఎనుముల నరసయ్య, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు సంధ్యారాణి, నాయకులు కిషన్ రాజమౌళి, మల్లేష్ గౌడ్, ప్రజాతంత్ర విద్యార్థి సంస్థ డిఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సంబాజీ, అదిలాబాద్ జిల్లా అధ్యక్షులు సోయం జుగాధిరావు, జగిత్యాల జిల్లా అధ్యక్షులు గోపి చంద్రయ్య, నాయకులు మామిడి నాగరాజు, దుర్గం మల్లేష్, దుర్గం మున్నయ్య, దర్శనాల మల్లేష్, బాలసాని మల్లేష్ గౌడ్, వేడ్మా నాగరావు, కుడ్మేత భగవంతరావు, గుడికందుల రవి, సీట్ల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

